ప్రజాశక్తి

గురువారం 30 జనవరి 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

సిపిఎం రాష్ట్ర మహాసభలను

జయప్రదం చేయాలి

- 31న అద్దంకికి రానున్న జాతా
- పార్టీ బాపట్ల జిల్లా కార్యదర్శి గంగయ్య

మాట్లాడుతున్న గంగయ్య

ప్రజాశక్తి-అద్దంకి

సిపిఎం రాష్ట్ర మహాసభలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని, మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య కోరారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా జీవనంలో అనేక ప్రధానమైన సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని గుర్తిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తూ.. పోలవరం నుండి బయలుదేరిన జాతా అద్దంకి పట్టణానికి ఈ నెల 31న మధ్యాహ్నం ఒంటి గంటకు వస్తుందన్నారు. ప్రజలు స్వాగతం పలికి సభను జయప్రదం చేయాలని కోరారు. బాపట్ల జిల్లాలో కూడా అనేక సమస్యలు ఉన్నాయని, కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఈ మౌలిక సమస్యల పట్ల సరైన శ్రద్ధ పెట్టడం లేదన్నారు. అద్దంకి నియోజకవర్గంలో భవనాసి రిజర్వాయర్ ఎన్నో సంవత్సరాల క్రితం ఎక్కువ భాగం పూర్తి చేసి అలానే ఆగిపోయిందన్నారు. కొద్దిపాటి నిధులతో దాదాపు పది వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి అవకాశం ఉందన్నారు. మేదరమెట్ల ఎర్రం పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం, ఇంకా పూర్తి కాలేదు. గుండ్లకమ్మ ప్రాజెక్టు కాలువలు అలానే ఆగిపోయాయన్నారు. ▶ 2లో

'రియల్' భారాలు

- పురోగతి లేని రియల్ఎస్టేట్ వ్యాపారం
- ఆదాయం కోసం రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ప్రజలపై కొత్త కొత్త భారాలు వేయడానికి వెనకాడని వైనం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఆదాయాలు పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై కొత్త కొత్త భారాలు వేసేందుకు సిద్ధమైంది. ఎక్కడ ఆదాయం వస్తుందనుకుంటే అక్కడ ప్రజలపై ఏదో రూపంలో భారాలు వేసే దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా ఫిబ్రవరి ఒకటి నుంచి భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతున్నట్లు ఈ పాటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాగానే కొత్త భారాలు పడతాయి. దీన్ని గ్రహించిన కొందరు భూముల కొన్న వాళ్ల ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఛార్జీలు లేదా ఫీజులు పెరుగుతాయని భయపడుతున్నారు. వాస్తవానికి ఇప్పుడు రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచాల్సిన అవసరం లేదు. ఎందుకంటే రియల్ఎస్టేట్ వ్యాపారం ఏమీ ఊపందుకోలేదు. ఇంకా పుంజుకోలేదు. కొనే వాళ్ల తక్కువగానే ఉన్నారు. రెండేళ్ల క్రితం ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. అయితే కొద్దిగా మార్పు ఉంది. అందరూ రాజధానిపై పడ్డారు. అమరావతి చుట్టుపక్కల భూములు కొంటున్నారు. అక్కడ ధరలు పెరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే ధరలు పెరిగాయన్నది వాస్తవం. వైసిపి హయాంలో తక్కువ ధరలకు కొన్నవాళ్లకు మంచి లాభం వచ్చింది. రూ.రెండు కోట్లకు కొన్న భూమి ఇప్పుడు రూ.ఐదారు కోట్లకు పెరిగిందంటున్నారు. అందుకే అందరూ అమరావతివైపే చూస్తున్నారు. పెట్టుబడులు అక్కడే పెడుతున్నారు. మరో వైపు మొన్నటి వరకూ శిథిలాలుగా ఉన్న భవనాల నిర్మాణం మళ్లీ మొదలైంది. నిర్మాణ రంగం కూడా కొత్తపుంతలు తొక్కుతోంది. దీంతో అందరూ అక్కడే పెట్టుబడులు పెడుతున్నారు. భూములు కొంటున్నారు. చేతులు మారుతున్నాయి. లాభాలు చూస్తున్నారు. ఇదొక చర్చగా మారింది. జాతీయరహదారి వెంట ఉన్న భూములకూ గిరాకీ పెరిగింది. ఏదేమైనా జిల్లాల నుంచి చేతిలో డబ్బున్నవాళ్లంతా ఇప్పుడు అమరావతి పైనే ఉన్నారు. ఇక నేతలు కొందరు హైదరాబాద్లో భారీ వెంచర్లలో ▶ 2లో

కలెక్టర్ వెంకటమురళి

చేనేతల పేదరికం పోగొట్టాలి..

బాపట్ల కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చేనేత కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. చేనేత కుటుంబాల జీవన పరిస్థితులపై సంబంధిత అధికారులతో స్థానిక కలెక్టరేట్లోని బుధవారం ఆయన సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ చేనేతలకు విరివిగా రుణాలు ఇవ్వాలని చెప్పారు. చేనేత వత్తిలో ఉన్న వారంతా కూలి చాలక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అర్హులైన వారందరికీ ముందుగా గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. జాయింట్ లైబిలిటీ గ్రూపులు ఏర్పాటుచేసి నేత కార్మికులను సభ్యులుగా చేర్చాలన్నారు. వారందరికీ రుణ సదుపాయం కల్పించేలా చేనేత జౌళి, బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రక్రియ సమర్ధంగా నిర్వహించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాల న్నారు. చేనేత పార్క్ అభివద్ధిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.చేనేత ముద్ర పథకం కింద 1,044 మందికి రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు 870 దరఖాస్తులు నేతన్నల నుంచి వచ్చాయన్నారు. వాటిని తక్షణమే పరిశీలించి అర్హులందరికీ రుణ సదుపాయం కల్పించాలన్నారు. సమావేశంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు నాగమల్లేశ్వరరావు, ఎల్డిఎం శివకష్ణ పాల్గొన్నారు.

రోడ్డెక్కితే టోల్ బాదుడే.?

- ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో రహదార్ల నిర్మాణాలు
- భవిష్యత్లో ప్రయాణికులకు తప్పని భారాలు.!

నిర్మాణంలో ఉన్న ఓడరేవు -పిడుగురాళ్ల 167ఏ జాతీయ రహదారి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రానున్న కాలంలో జాతీయ రహదారులతో పాటు రాష్ట్ర రహదారుల నుంచి కూడా టోల్ వసూళ్ల జరపనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జాతీయ రహదారుల విధానంలోనే రాష్ట రహదారుల నిర్మాణాల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో (పీపీపీ) రహదార్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించడం జరిగింది. ఈ మేరకు ముందుగా రాష్ట్రంలోని 18 రోడ్లను ఈ పీపీపీ విధానంలో నిర్మించి టోల్గేట్లు పెట్టి వాహనదారుల నుంచి టోల్ పన్నుల అంశాన్ని ముందుకు తెచ్చారు. ఈ ప్రతిపాదనల ప్రకారం బాపట్ల జిల్లాలో పీపీపీ విధానంలో 41.44 కి.మీ.ల మేర ఉన్న పర్చూరు-గుంటూరు పాత మద్రాసు రోడ్డు, 51.24 కి.మీ మేర ఉన్న బాపట్ల- గుంటూరు రహదారి, ప్రకాశం జిల్లాలో 113.25 కి.మీ.ల మేర ఉన్న ఒంగోలు-బేస్తవారిపేట రహదారులను ఎంపిక చేశారు. రెండో విడతలో బాపట్ల జిల్లాలో 54.53 కి.మీ.లు మేర ఉన్న పర్చూరు- జాగర్లమూడి- పురిమెట్ల రాష్ట రహదారి, 40.15 కి.మీ.ల మేర ఉన్న అద్దంకి-సంతమాగులూరు రహదారి, ప్రకాశం జిల్లాలో 56.14 కి.మీ.లు పొదిలి-వినుకొండ, 64.4 కి.మీ.లు పొదిలి-టంగుటూరు రహదార్లను ఎంపిక చేశారు.

బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న పలు రాష్ట్ర రహదారు లను, జాతీయ రహదారులుగా మార్చే ప్రతిపాదనలు చేశారు. బాపట్ల- గుంటూరు రాష్ట్రీయ రహదారిని జాతీయ రహదారిగా మార్చడానికి ఇప్పటికే ప్రతిపాదనలు చేశారు. దీంతో పాటు ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో ఉన్న పలు రహదారులను జాతీయ రహదారులుగా మార్చే ప్రతిపాదనలు పరిశీలన కోసం త్వరలో కేంద్ర బృందం రానుంది. గుంటూరు నుంచి నాగులప్పలపాడు వయా ప్రత్తిపాడు, పెద్దనందిపాడు, పర్చూరు, ఇంకొల్లు మీదుగా నాగులుప్పలపాడు ▶ 2లో

మంచి పోరాటము పోరాడితిని నా పరుగు కడ ముట్టించితిని. విశ్వాసము కాపాడుకొంటిని.//తిమోతి 4:7

జ్ఞాపకార్థ కూడిక

కీ॥శే॥ బడుగు మరియమ్మ గారు

మరణం :-28-01-2025

ప్రేమానురాగాలు పంచి కుటుంబం ఉన్నతికై
అహర్నిశలు శ్రమించి మమ్ములను
ఉన్నత స్థితికి చేర్చిన
మా మాతృమూర్తి మా కుటుంబ పెద్ద
శ్రీమతి బడుగు మరియమ్మ గారు
ది 28-01-2025 న పరలోక ప్రవేశము చేసితిరి.
కావున వారి మరణం
మాకు తీరని లోటు
ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
ఆ భగవంతుని ప్రార్థిస్తూన్నాము.....

ఇట్లు
మీ...
కుటుంబ సభ్యులు

జ్ఞాపకార్థకూడిక :- ది 30-01-2025 గురువారం సాయంత్రం కారంచేడు మండలం, కుంకలమర్రు గ్రామంలో మా స్వగృహం నందు జ్ఞాపకార్థ కూడిక జరుగునని తెలియపరచడమైనది .

వైసిపి పాలనలో రాష్ట్ర ఖజానా ఖాళీ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

వైసిపి పాలనలో రాష్ట్ర ఆర్థిక ఖజానా ఖాళీ అయ్యిందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాళా తీసిందని టిడిపి బాపట్ల పార్లమెంటు మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. బుధవారం 2019 -24 మధ్య వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి చేసిన ఆర్థిక విధ్వంసంపై ఏలూరి బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలోనే జగన్మోహన్ రెడ్డి తాకట్టు ముఖ్యమంత్రిగా నిలిచారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో జగన్ రెడ్డి కుటుంబం రూ.8 లక్షల కోట్లు చేసిందన్నారు. రాష్ట్రానికి గుండె కాయ లాంటి సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం జగన్ రెడ్డి చేసిన అప్పులకు బకాయిలు చెల్లిస్తుందని

పేర్కొన్నారు. ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు 2,832 కోట్లు, ఇతర ఫీజు రీయంబర్స్ మెంట్ రూ. 450 కోట్లు , చిక్కిలు, కోడిగుడ్లు రూ.256 కోట్లు , వసతి దీవెన రూ. 989 కోట్లు, ఆరోగ్య శ్రీ బకాయిలు రూ.1800 కోట్లు, ధాన్యం బకాయిలు రూ.1,600 కోట్లు, ఉద్యోగులకు బకాయిలు రూ. 20,000 కోట్లు , ఇరిగేషన్ కాంట్రాక్టర్ల బకాయిలు . 19,000 కోట్లు , గృహ నిర్మాణం బకాయిలు 7,800 కోట్లు , ఉపాధి హామీ బకాయిలు 2,100 కోట్లు ఇలా మొత్తం జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయి రూ.1.40 లక్షల కోట్లు ఉన్నాయన్నారు. జగన్ విలాసాలు, జల్సాలకు రూ.19.871.35 కోట్లు ప్రభుత్వ ధనం దుబారా చేశారని ఎమ్మెల్యే ఏలూరి ఆరోపించారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - చీరాల

మండల పరిధిలోని దేవి నూతల, కావూరివారిపాలెం, గవినివారిపాలెంలోని వరి ధాన్యం కుప్పలను వైసిపి చీరాల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోలు గురించి రైతులతో మాట్లాడారు. ధాన్యం ప్రొక్యూర్ మెంట్ అధికారులు ఇచ్చిన టార్గెట్ మేరకు ధాన్యం కొనుగోలు పూర్తయినట్లు చెబుతున్నట్లు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పొలాల్లో ఇంకా 70 శాతం ధాన్యం నిల్వఉన్నట్లు తెలిపారు. ఈ ధాన్యాన్నికూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. లేకుంటే రైతులతో కలిపి పోరాటం చేస్తామని రమణారెడ్డి హెచ్చరించారు.

కేక్ కటింగ్

ప్రజాశక్తి -పర్చూరు

సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ అవార్డ్ ఎంపికైన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పర్చూరులోని బొమ్మల సెంటర్ కూడలిలో టిడిపి సీనియర్ నాయకుడు సుభానీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో షేక్ గౌస్, కొండ్రగుంటి శివ ,హుస్సేన్ ,జానీ,సురేష్ , చందనాల వెంకటేశ్వర్లు, బాషా, సాంబశివరావు , దగ్గుబాడు బాజీ , సుభాని, అమీన్ బుడే పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -కారంచేడు

మండల పరిధిలోని స్వర్ణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరల్ గ్లూకోస్ టోలరెన్స్ టెస్ట్ నిర్వహిం చారు. అదేవిధంగా షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ శాలిని, డాక్టర్ హస్మప్రియ, ఎల్‌టి శంకర్, స్టాఫ్ నర్స్ మల్లీశ్వరి, ఎఎన్ఎంలు నాగలక్ష్మి, సౌజన్య, హెచ్ఇ మీనా కుమారి, హెచ్‌వి మాధురి సిఫోర,ఆశా వర్కర్లు బేబీ,సింగమ్మ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

'రియల్' భారాలు..

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడులు పెడుతున్నారు. అక్కడ ఇంకా వ్యాపారం బాగుందని అంచనా. ఇప్పటికే పలువురు నేతలు హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నారు. అక్కడే ఇళ్లు కట్టుకుని ఉంటున్నారు. జిల్లా దాటి వెళ్లారంటే హైదరాబాద్‌లోనే తేలుతున్నారు. అక్కడ రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టుకుంటున్నారు. ఆదాయాలకు ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. ఈ తరుణంలో జిల్లాల్లో రియల్‌ఎస్టేట్‌పై పెట్టుబడులు లేకపోవడంతో ఊపుగా లేదు. పైగా ఒంగోలు, మంగమూరు రోడ్డులో మర్రిచెట్టు సమీపంలో కొత్తగా వేస్తున్న వెంచర్లలో గది రూ.నాలుగు లక్షలు చెబుతున్నారు. రోడ్డు పక్కనే ఐదారు లక్షలకుపైగానే ధరలు చెబుతున్నారు. అయితే కొనుగోళ్లు పెద్దగా లేవు. రిజిస్ట్రేషన్లు పెద్దగా కనిపించడం లేదు. కొందరు ధరలు పెరుగుతాయని ఎదురుచూస్తున్నారు. రియల్‌ఎస్టేట్ బ్రోకర్లు హడావిడి చేసి ఏదో వ్యాపారం ఊపందుకుందనే ప్రచారాలు చేసినా ఫలితం కనిపించడం లేదు. మొన్నటివరకూ ఇసుక సమస్య కొలిక్కి రాకపోవడంతో పాటు ఇనుము, సిమెంటు ధరలు భారీగాపెరిగాయి. మరోవైపు మున్సిపల్ రూల్స్ కూడా కఠినంగా ఉన్నాయనే చర్చ ఉంది. ఈ తరుణంలో నిర్మాణరంగంలోనూ నిస్తేజం ఉంది. ఇలా అనేక కారణాలతో రియల్‌ఎస్టేట్ వ్యాపారంపైనా, నిర్మాణరంగంపైనా ఇంకా నిస్తేజం వీడలేదు. ఫలితంగా భూముల కొనుగోళ్లు, ప్లాట్ల వ్యాపారం వేగంగా లేదు. ఇవన్నీ పెట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ ఖజానా నింపుకునేందుకు రిజిస్ట్రేషన్ల ఆదాయం కోసం ఇప్పుడు భూముల విలువను పెంచాలనే కసరత్తు చేస్తోంది. ఇది అంతిమంగా ప్రజలపై పడే భారంగానే భావించాలి.

సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వాసితులకు సరైన పద్ధతిలో నష్టపరిహారం చెల్లించలేదన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారిందని, దీనికి బైపాస్ వేయాలనే ప్రతిపాదన పెట్టినప్పటికీ పాలకపక్షం నిర్లక్ష్యంతో మూల నపడిందన్నారు. జిల్లాలో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీని అభివృద్ధి కోసం సరైన ప్రయత్నం జరగలేదన్నారు. ఈ సమస్యను పరిష్కారం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందన్నారు. ఫిబ్రవరి 3న నెల్లూరులో రాష్ట్ర మహాసభల సందర్భంగా జరిగే ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. సభకు ఆల్‌ఇండియా పొలిట్‌బ్యూరో సభ్యులు బందారకాత్, బీవీ రాఘవులు, ఎంఎ బేబీ, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉపన్యసిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డెక్కితే టోల్‌బాదుడే.?

(మొదటిపేజీ తరువాయి)

వరకు ఉన్న 83 కిలోమీటర్ల రాష్ట్ర రహదారి ని, అద్దంకి నుంచి మోటుపల్లి వయా రేణగివరం, అలవలపాడు, చంద లూరు, కొణికి, ఇంకొల్లు మీదుగా మోటుపల్లి వరకు 40 కిలోమీటర్ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్చే ప్రతిపాదనలు చేశారు. బాపట్ల నుంచి మార్టూరు వయా నర్సాయపాలెం, కంకట పాలెం, చెరుకూరు, వీరన్నపాలెం, కొమరినేనివారిపాలెం, ఉప్పుటూరు, పర్చూరు, యద్దనపూడి మీదుగా దేగర్లమూడి జాతీయ రహదారి 16 వరకు ఉన్న 53 కిలోమీటర్ల రాష్ట్ర రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలన్న ప్రతిపాదనలు చేశారు. చీరాల వాడరేవు –పిడుగురాళ్ల 167ఏ జాతీయ రహదారి ప్రస్తుతం నిర్మాణంలో ఉంది. అలాగే బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం హార్బర్ నుంచి గుంటూరు వరకు మరొక జాతీయ రహదారి రానుంది. అలాగే కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు ఉన్న 216 జాతీయ రహదారిని నాలుగు, ఆరు వరుసలు రెండు దశల్లో నిర్మించనున్నారు. ఈ రోడ్లు అన్నింటిపై టోల్ వసూళ్లు జరపనున్నారు. రాష్ట్ర రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం వద్ద నిధులు లేవన్న కారణంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో (పిపిపి) రహదార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొన్నింటిని జాతీయ రహదారులుగా మార్చనున్నారు. ఈ కారణంగా రానున్న కాలంలో రోడ్డెక్కితే టోల్ బాదుడు తప్పనిసరి కానుంది.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No : 20/2023

in

O.S.No : 568/2021

బి.పాండు రంగస్వామి
అలియాస్ బొద్దు పాండు రంగస్వామి..డి.హెచ్.ఆర్

వర్సెస్

మండ్ల నాగార్జున ..జె.డి.ఆర్

టు,

జె.డి.ఆర్ చిరునామా

మండ్ల నాగార్జున తండ్రి నాగయ్య,
వయస్సు 31 సం.లు, హిందూ,
నల్లగుంట్ల గ్రామం, కొమరోలు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో డి.హెచ్.ఆర్ మీ నుండి పరిహారం రాగోరి పై నెంబరు పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్‌లో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ : 07-02-2025న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో నీ పరోక్షమందు సదరు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 28-01-2025

ఇట్లు
మోడీ పిచ్చయ్య యాదవ్,
డి.హెచ్.ఆర్ పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా,
ఆంధ్రప్రదేశ్

నోటీసు

మహారాజశ్రీ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఒంగోలు

OS No : 656/2023

రామకూరు శ్రీనివాసరావు .... వాది

వర్సెస్

రామకూరు వెంకటేశ్వర్లు మరియు వగైరాలు
.... ప్రతివాదులు

To

D4) బేతంశెట్టి కళ్యాణ్ చక్రవర్తి,
S/o శంకరరావు, హిందూ, వయస్సు 40, సం
నివాసం : డోర్ నెంబర్ 20-1-19, బండ్లమిట్ట,
ఒంగోలు టౌన్ మరియు మండలం ప్రకాశం జిల్లా.

D5) బేతంశెట్టి నారాయణమ్మ,
W/o శంకరరావు, హిందూ, వయస్సు 68, సం
నివాసం : డోర్ నెంబర్ 20-1-19, బండ్ల మిట్ట,
ఒంగోలు టౌన్ మరియు మండలం ప్రకాశం జిల్లా.

పై నెంబర్ గల దావాలో వాది అయిన రామకూరు శ్రీనివాసరావు దావా దాఖలు చేసియున్నారు. పై కోర్టు వారు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు పై కోర్టు వారి ఎదుట తేదీ 13-02-2025న ఉదయం 10.30గంటలకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలుతెలుపుకొనగలరు. లేనియెడల పై కోర్టు వారు మీ పరోక్షమున కేసు విచారించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
బండారు లక్ష్మీనారాయణ
అడ్వకేట్, ఒంగోలు

వేలం ప్రకటన

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో.

E.P. No : 11/2022

in

O.S.No : 39/2018

Between:-

గుంజి లక్ష్మి @ లక్ష్మమ్మ
....డి.హెచ్.ఆర్/ పిటిషనరు

and

పల్లెపు ఏడుకొండలు ......జె.డి.ఆర్/ రెస్పాండెంట్స్

పైన నెంబర్ అమలు పిటిషను లో ఈ దిగువ తెలిపిన షెడ్యూల్ దాఖలా స్థిరాస్తులను పై కోర్ట్ వారి ద్వారా, పై కోర్ట్ లో ది.10-03-2025 తేదీన ఉదయం గం.10.30.ని.లగాయత్తు బహిరంగ వేలం ద్వారా విక్రయించబడునని, ఇందుమూలముగా యవన్మందికి తెలియజేయుటమైనది. కావున వేలం పాటలో పాల్గొను దలచిన వారు పై కోర్ట్ లో హాజరు అయి పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూల్ :

ఐటెం : 1 ప్రకాశం జిల్లా చీరాల సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు - కారంచేడు మండలం -కారంచేడు గ్రామం- సర్వే నెంబర్ 871/3 -య 1.00 సెంట్ల మాగాణి భూమికి హద్దులు
తూర్పు : గోపు శివరామ కృష్ణ.
దక్షిణం : కొమ్మనబోయిన దయబాలు
పడమర : యార్లగడ్డ పద్మావతి.
ఉత్తరం : చెరుకూరి ఆదినారాయణ.
D.Hr. విలువ రూ 1,00,000/-
అమీనా విలువ రూ.4,00,000/-

ఐటెం : 2 ప్రకాశం జిల్లా- చీరాల సబ్- రిజిస్ట్రార్ ఆఫీసు - కారంచేడు మండలం -కారంచేడు పంచాయతీ సర్వే నెంబర్ 987 - అస్సెస్ మెంట్ నెంబర్ 1827-డోర్ నెంబరు. 17-91 - లో షెడ్ రూఫ్ మరియు కాళీ స్థలము మొత్తము విస్తీరణం య. 0.04 సెంట్లు (40 బారకుంటలు కు హద్దులు:
తూర్పు : బజారు.
దక్షిణం : పూస రాములు ఇల్లు.
పడమర : యార్లగడ్డ లక్ష్మయ్య
ఉత్తరం : కొత్తగొర్ల రాఘవులు
D.Hr. విలువ రూ .40,000/-
అమీనా విలువ రూ.2,00,000/-

ఐటెం : 3. ప్రకాశం జిల్లా చీరాల సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు - కారంచేడు మండలం -కారంచేడు పంచాయతీ - సర్వే నెంబర్ 987 - అస్సెస్ మెంట్ నెంబర్ 18018-డోర్ నెంబరు. 17- 65/2- లో సిమెంట్ షీట్ రూఫ్ గది మరియు కాళీ స్థలము మొత్తము విస్తీరణంయ.0.02.1/2 సెంట్లు 25 బార కుంటలు కు హద్దులు:
తూర్పు : పిట్టు శ్రీను.
దక్షిణం : పొదిలి వెంకటేశ్వర్లు .
పడమర : మద్దుకూరి బాల కోటయ్య.
ఉత్తరం : ప్రైవేట్ గల్లీ.
D.Hr. విలువ రూ .25,000/-
అమీనా విలువ రూ.1,00,000/-
వేలం తేది : 10-03-2025
ఫర్దర్ హియరింగ్: 17-03-2025
పర్చూరు.
ది.27.01.2025

// కోర్ట్ వారి ఉత్తరువుల మేరకు //

ఇట్లు
పోతిని సురేంద్ర
దగ్గుబాటి రాఘవయ్య చౌదరి
D.Hr తరపు అడ్వొకేట్లు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P No: 51/2023

IN

O.S.No : 24/2018

గోళ్ళ శంకరయ్య .. డి.హెచ్.ఆర్

వర్సెస్

వల్లెల చెన్నారెడ్డి చనిపోతే ఆయన వారసులు
వల్లెల వెంకటనరసమ్మ వగైరాలు .. జె.డి.ఆర్

To

3వ జె.డి.ఆర్ చిరునామా

వల్లెల రాజేశ్వరరెడ్డి తండ్రి లేట్ చెన్నారెడ్డి,
హిందూ, వయస్సు సుమారు 35సం.లు,
రాజకీయ నాయకుడు, చిన్న కందుకూరు గ్రామం,
అర్ధవీడు మండలం, ప్రకాశం జిల్లా,
ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు **E.P**లో డి.హెచ్.ఆర్ మీ నుండి **E.P** పరిహారం రాగోరి పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్‌లో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ 27-02-2025న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో నీ పరోక్షమందు సదరు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 27-01-2025

ఇట్లు
శ్రీ భూపని వెంకటేశ్వర రావు,
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా,
ఆంధ్ర ప్రదేశ్.
సెల్ నెం. 9866008671

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No : 18/2023

IN

O.S No : 225/2022

జాజం వెంకట రమణ ..డి.హెచ్.ఆర్

వర్సెస్

అయ్యపు రాజు రాజేంద్ర కుమార్ .. జె.డీ.ఆర్

వేలం ప్రకటన

పై నెంబరు అమలు అర్జీలో షెడ్యూలు స్థిరాస్తిని శ్రీ కోర్టువారు 24-02-2025 వ తేదీన ఉదయం 10:30 గంటల లగాయతు వేలం వేయుదురు. వేలంలో సవాలుదార్లు పాలుగొనవచ్చును.

షెడ్యూలు

షెడ్యూల్ ఆస్తి కొమరోలు గ్రామంలో, కొమరోలు మండలం, గిద్దలూరు సబ్-రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రేషన్ మార్కాపూర్, ప్రకాశం జిల్లాలో ఉంది. సర్వే నెం 656 విస్తీర్ణం ఎకరా 0.36 సెంట్లు

స్థిరాస్తి వివరము

సర్వే నెం 656, విస్తీర్ణం ఎకరా 0.36 సెంట్లు
హద్దులు :
తూర్పు : మానుకొండు బాబు భూమి
పడమర : వెంగయ్య చౌదరి భూమి
ఉత్తరం : రోడ్
దక్షిణం : ఉమ్మడి సుబ్బయ్య భూమి
డిహెచ్ఆర్ విలువ : రూ.3,00,000-00
అమీనా విలువ : రూ.5,00,000-00
మార్కెట్ విలువ : రూ.18,000-00
తేదీ : 29-01-2025
స్థలం : గిద్దలూరు

ఇట్లు
శ్రీ షేక్ యాసిన్ భాషా,
డి.హెచ్.ఆర్ తరుపు అడ్వకేట్,
గిద్దలూరు

మాట్లాడుతున్న సామాజిక తనిఖీ అధికారులు

సామాజిక బృందం తనిఖీ

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని సామాజిక బృందం తనిఖీ చేసింది. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు హెచ్‌ఎం ఎం.శ్రీదేవి తెలిపారు. కొత్తపట్నం మండలానికి నలుగురు డిఆర్‌పిలు సామాజిక తనిఖీల్లో పాల్గొన్నారు. స్టాక్ రైస్, కోడిగుడ్లు, చిక్కీలు రిజిస్టర్లు సక్రమంగా ఉన్నట్లు తేలింది. పారిశుధ్య నిర్వహణ, పాఠశాలలో రన్నింగ్ వాటర్ మౌలిక సదుపాయాలు గుర్తించారు. ఇటీవల మినరల్ వాటర్ అందడం లేదని, డైనింగ్ హాల్ లేదని, విద్యార్థులకు సరిపడా ప్లే మెటీరియల్ లేదని, అదనంగా గ్రౌండ్ అవసరమని, మూడు నుండి ఐదు తరగతుల వరకు విద్యార్థులు బెంచీలు లేక క్రింద కూర్చోవడం జరుగుతుందని పరిశీలించారు. ఈ నివేదికను ఎస్ఎస్ఏటి కార్యాలయానికి అందజేస్తామన్నారు. సామాజిక తనిఖీలో డీఆర్‌పిలు కేసీ సుబ్బారాయుడు, వి.సూర్య ప్రకాష్, హెచ్‌ఎం ఎం.శ్రీదేవి, ఎస్ఎంసి చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

వెలిగొండకు నిధులు మంజూరు చేయాలని..

31న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-మార్కాపురం

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ ఈ నెల 31వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఐ, సిపిఎం నేతలు వెల్లడించారు. స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 31న ఉదయం 10 గంటలకు మార్కాపురం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.సోమయ్య, సిపిఐ ఏరియా కార్యదర్శి అందె నాసరయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, సిపిఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య కోరారు.

క్రీడా మైదానంలో పిచ్చి చెట్లను తొలగిస్తున్న దృశ్యం

సొంత నిధులతో మైదానం శుభ్రం

ప్రజాశక్తి-కొండపి

విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఆటలు పోటీలు ఎంతో అవసరం అని కె.ఉప్పలపాడు టీడీపీ నాయకుడు జి.రామూర్తినాయుడు అన్నారు. బుధవారం స్థానిక హైస్కూల్ గ్రౌండును ఆయన తన సొంత నిధులతో శుభ్ర పరుస్తున్నాడు. గ్రౌండ్‌లో ఉన్న చిల్లచెట్లు, చెత్తచెదారం యంత్రం సహాయంతో తొలగించారు. విద్యార్థుల మానసిక ఉల్లాసం కోసం గ్రౌండ్ ఎంతో అవసరం అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పాఠశాలకు సహాయ సహకారాలు అందిస్తున్న రామూర్తి నాయుడుకు హెచ్‌ఎం సుసన్నకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రజల ఇబ్బందులు తొలగించేందుకే 'మన ఊరు-మన ఎమ్మెల్యే' కార్యక్రమం చేపట్టినట్లు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక 9వ వార్డులో మన ఊరు-మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా కందుల పర్యటించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి ఆ వార్డు ప్రజలు పలు సమస్యలు తీసుకువచ్చారు. మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. ఆ వార్డు పరిధిలో గల చెరువులో కొంత భాగం కొందరు కబ్జా చేశారని, గృహాలు నిర్మించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. చెరువు కట్టపై నడిచేందుకు వీలులేకుండా పోయిందన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని మరుగుదొడ్ల వ్యర్థాలు రహదారిపైకి వస్తున్నాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే కందుల స్పందించారు. ఆక్రమణలపై విచారణ జరిపిస్తామన్నారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి మరుగుదొడ్ల నుంచి వ్యర్థాలు రహదారిపైకి రాకుండా చర్యలు తీసకుంటామని చెప్పారు. సమస్యలు ఉంటే తనవద్దకు నేరుగా రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వార్డు పర్యటనలో మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, టిడిపి నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, పఠాన్ ఇబ్రహీంఖాన్, ఉప్పులదిన్నె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

అన్నా రాంబాబు

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రజలను మోసం చేయడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో ఎవ్వరూ పోటీ పడలేరని వైసీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు ఎద్దేవా చేశారు. సాధ్యం కాని హామీలతో అధికారంలోకి రావడం, అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం చంద్రబాబుకు మాత్రమే చెల్లుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు మీడియాకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తి కాలేదని, అప్పుడే రూ.1.19 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. ఈ మధ్య కాలంలో కొత్తగా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. సంపద సృష్టి ఎక్కడో చెప్పాలన్నారు. వివిధ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న వారిలో లక్షల్లో ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. గత సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలు నిర్మాణం చేపట్టగా వాటిలో కొన్ని పూర్తి కావడం జరిగిందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారన్నారు. చంద్రబాబు తప్పులకు పవన్‌కళ్యాణ్, పురంధేశ్వరి కూడా వంతపాడుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు చంద్రబాబు కట్టుబడి పాలన సాగించాలని సూచించారు. లేని పక్షంలో ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

పండ్ల తోటల సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పండ్ల తోటల సాగుతో లాభాలు గడించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి వై.గోపిచంద్ అన్నారు. యర్రగొండపాలెం ఉద్యానశాఖ పరిధిలో కవలకంట్ల గ్రామంలో సాగులో ఉన్న మిర్చి, నిమ్మ, బత్తాయి తోటలను ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా గోపిచంద్ మాట్లాడుతూ పండ్ల తోటల రైతులకు నీటి కుంటలు మంజూరు చేస్తామన్నారు. రైతులు అధిక ఆదాయాన్నిచ్చే పండ్ల తోటల వైపు మొగ్గు చూపాలన్నారు. మిరప తోటల్లో కురిసిన వర్షాలకు తాలు, కాయలు ఎక్కువగా రాలి, నల్ల తామర పురుగు వలన బాగా నష్టం జరిగింద న్నారు. ఈ-పంటలో నమోదు చేసుకున్న వారికి బీమా వర్తిస్తుందన్నారు. రబీలో ఈ-పంట నమోదు చేసిన పొలాలను పరిశీలించారు. ఈయన వెంట ఉద్యాన అధికారి పల్లకి ఆదిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మిర్చి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-బేస్తవారిపేట

బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు, పందులపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న కంది పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. గుంటూరు లాం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు ఎన్.సాంబశివారెడ్డి, కె.వి శివారెడ్డిలు దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పి.సంధ్యారాణి,

కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జి.రమేష్‌లు దెబ్బతిన్న కంది పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో జక్కం మెర్సీ మాట్లాడుతూ 2,227 మంది రైతులు 3,358 ఎకరాల్లో కంది పంట సాగు చేసినట్లు వివరించారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని సంజీవరావు పేట, తాళ్లపల్లె, ఓబులాపురం, గడికోట గ్రామాల్లో బుధవారం గుంటూరు లాం ఫార్మ్ వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.మోహన్ రెడ్డి దెబ్బతిన్న కంది పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ముసురు పట్టడంతో పూత రాలిపోయిందని, ఎకరాకు 50 నుంచి 100 కేజీలు కూడా దిగుమతి వచ్చే అవకాశాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.సాంబ శివరావు, సీనియర్ శాస్త్రవేత్తలు శివారెడ్డి, పి.సంధ్యా రాణి, దర్శి వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు జి.రమేష్, కేవికే, గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీ నాయక్, ఏవో వై.విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మార్టూరు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయంపై బుధవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఏఎస్ఐ మహబూబ్ బాషా తెలిపిన వివరాల మేరకు.. మార్టూరులో నివాసం ఉంటున్న చిగురుపాటి శివయ్య (68) ఈనెల 12వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గాయపడిన శివయ్యను కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందగా మృతుని కుమారుడు చిగురుపాటి శివశంకర్ బుధవారం మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-సంతమాగులూరు

మృతి చెందిన ఫణీంద్ర

టైరు పంక్చర్ కావడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పల్నాడు జిల్లా, గంటావారిపాలెం గ్రామ సమీపంలో గుంటూరు- కర్నూలు రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన బండారు ఫణీంద్ర (27) మృతిచెందాడు. అందిన వివరాల ప్రకారం.. మృతుడు ఫణీంద్ర ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ట్రక్కులో రాళ్లు వేసుకొని అడ్డరోడ్డు నుంచి వినుకొండ వైపు వెళ్తున్నాడు. ఘటనా స్థలం వద్దకు వెళ్లేసరికి ముందు టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో ట్రాక్టర్ అదుపుతప్పి మార్జిన్‌లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. దీంతో ఫణీంద్ర కింద పడ్డాడు. ట్రక్కులోని రాళ్లు ఆయనపై పడ్డాయి. దీంతో ఫణింద్ర అక్కడకక్కడే మృతి చెందాడు. శావల్యాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసెఫ్

కూలీల హాజరు శాతాన్ని పెంచాలి

డ్వామా పీడీ జోసెఫ్

ప్రజాశక్తి-మద్దిపాడు

ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరు శాతం పెంచాలని డ్వామా పీడీ జోసెఫ్ అన్నారు. మండల కేంద్రమైన మద్దిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి కూలీలను పెంచడంతోపాటు ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. కూలీ రూ.300 లకు తక్కువ కాకుండా చూడాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేయించాలన్నారు. రోజుకు 50 మంది ఉపాధి కూలీలు తగ్గకుండా చూడాలని చెప్పారు. ప్రతి గ్రామంలో క్యాటిల్ షెడ్లు కంప్లీట్ చేయాలని, కొత్తవి నమోదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీడి ఓ వెంకటస్వామి, ఎంపీడీవో జ్యోతి, ఏపీవో ధనుంజయ వర్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సైడు కాల్వల్లో పూడికతీత

ప్రజాశక్తి-కొండపి

పూడిక తీస్తున్న కార్మికులు

కొండపి మండలంలోని అనకర్లపూడిలో సైడు కాలువలో పూడిక తీత పనులు చేపట్టారు. ప్రస్తుత సీజన్‌లో వస్తున్న జ్వరాలను దృష్టిలో ఉంచుకొని పంచాయతీ కార్యదర్శి పారిశుధ్య పనులు చేపట్టారు. ఇందులో భాగంగా సైడు కాలువలో పూడికతీత పనులు, గ్రామంలో బ్లీచింగ్, చెత్తను తీసివేయడం వంటి పనులు చేపట్టారు

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు, నాయకులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - రేపల్లె

సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పుట్టగుంట ఆదినారాయణ కుటుంబ సభ్యులు సహకారంతో ఎస్ఎఫ్ఐ- యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ బుధవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె. సాయిప్రసాద్ మాట్లాడుతూ హాస్టల్స్ ఉండే పేద విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. 10 తరగతి పరీక్షలో మంచిఫలితాలు సాధించాలన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన పుట్టగుంట ఆదినారాయణ కుటుంబసభ్యుల సహకారంతో గత 15 సంవత్సరాలుగా రేపల్లె పట్టణంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్టంలో విద్యారంగం బాగుండాలని ఉపాధ్యాయులు, విద్యార్థులుగా విద్య వ్యవస్థ బాగుడలని ఎస్ఎఫ్ఐ - యుటిఎఫ్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి హాస్టల్స్ వార్డెన్లు పి.ప్రసాద్, పి.పద్మావతి, నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్. మణిలాల్, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నేతలు ఎం. సూర్యప్రకాష్, కెవి.లక్ష్మణరావు, యుటిఎఫ్ నేతలు కె.విజయకుమార్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రవి నాయుడుతో ఏలూరి

గ్రామీణ ప్రాంత క్రీడాకారు లను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో శాప్ చైర్మన్ రవి నాయుడుతో ఎమ్మెల్యే ఏలూరి బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకొని మెరుగైన ఆరోగ్యంతో మెలిగేలా కషి చేయాలన్నారు. క్రీడల అభివద్ధికి రవి నాయుడు చేస్తున్న కషిని ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు..యువత మానసిక ఉల్లాసం కోసం ఏర్పాటు చేసిన ఏలూరి యూత్ ఫిట్నెస్ సెంటర్ సందర్శించానని, క్రీడా వికాస కేంద్రాలను ప్రత్యేక శ్రద్ధతో అభివద్ధి చేస్తామని రాష్ట్ర శాప్ చైర్మన్ రవి నాయుడు పేర్కొన్నారు. ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో యూత్ ఫిట్నెస్ కోసం జిమ్‌లు ఏర్పాటు చేయడంపై రవి నాయుడు ఏలూరిపై ప్రశంసలు కురిపించారు.

సురేష్ బాబును సన్మానిస్తున్న వరికూటి అశోక్‌బాబు

వైసిపి గ్రామ అధ్యక్షుడిగా సురేష్ బాబు

ప్రజాశక్తి- వేమూరు

వేమూరు గ్రామ వైసిపి అధ్యక్షుడిగా గుమ్మడి సురేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నియ్యాడు. వైసిపి వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వరికుటి అశోక్ బాబు ఆధ్వర్యంలో నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు వైసిపి అధ్యక్షుడిగా అవకాశం కలిపించిన వరికూటి అశోక్‌బాబు, వైసిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి : సిపిఎం

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నిర్వహిస్తున్న సిపిఎం రాష్ట్ర 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం భట్టిప్రోలు మండల కార్యదర్శి జి. సుధాకర్ కోరారు. మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యం ప్రజాసమస్యలు మీద పోరాటాలు నిర్వహించే సిపిఎం (శాఖ, మండల, పట్టణ జిల్లా మహాసభలు పూర్తిచేసుకున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రంలోని ప్రజాసమస్యలపై పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. రాష్టంలో నిర్వహించే పోరాటాలకు ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు. విశాఖ స్టీల్‌కు సొంతగనులు ఇవ్వాలని, టిడ్కో గహాలు లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని, ట్రూఅప్ పేరుతో పెంచిన కరెంటు చార్జీలను రద్దుచేయాలి, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలుపుదల చేయాలని నూతన ఏర్పాటు చేసిన అన్ని జిల్లాలు సమగ్రంగా అభివద్ధి చేయాలని సిపిఎం మహాసభ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు, నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, మధ్యతరగతి రంగాల సమస్యలపై నిరంతరం సిపిఎం ఆందోళనలు నిర్వహి స్తుందన్నారు.ప్రజలపై భారాలు మోపే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలా విధానాలకు వ్యతిరేకంగా నికరంగా సిపిఎం పోరా డుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు, పి.మనోజ్ కుమార్, భట్టు నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు, గుంటూరు దానియేలు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

'సెయింట్ ఆన్స్'కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు

ప్రజాశక్తి - వేటపాలెం

కో ఆర్డినేటర్లకు జ్ఞాపికలు అందజేస్తున్న కళాశాల యాజ మాన్యం

విద్యార్థులు తాము నేర్చుకున్న సాఫ్ట్‌వేర్లతో నూతన ఆవిష్కరణలపై దష్టి పెట్టాలని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు తెలిపారు. ఇసిఇ విభాగంలో మూడవ సంవత్సరం విద్యార్థులకు విఎల్ఎస్ ఐడిజ్కెన్‌పై మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్ షాప్ బుధవారంతో ముగిచింది. ఈ సందర్భంగా ముగిపు సభ నిర్వహించారు. సభలో కళాశాల కరస్పాండెంట్ పి.లక్ష్మణరావు, ప్రిన్సిపల్ కె. జగదీష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు తాము నేర్చుకున్న సాఫ్ట్‌వేర్లతో నూతన ఆవిష్కరణలపై దృషి సారిస్తే అద్భుతాలను సృష్టించవచ్చునని తెలిపారు. ఆదిశగా విద్యార్థులు కృషి చేయాలని ఆయన కోరారు. హౌదరాబాద్‌కు చెందిన కల్కి టెక్నాలజీస్ వారి ఆధ్వర్యంలో విఎల్ఎస్ఐ డిజ్కెన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఇసిఇ విభాగాధిపతి డి. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వర్క్ షాపులో ఆధునిక టెక్నాలజీలపై అవగాహవన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. కల్కి టెక్నాలజీస్ ప్రతినిధి వివేక్, ఆయన బందం విఎల్ఎస్ఐ డిజ్కెన్ ఫ్రంట్ ఎండ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. వివాడో సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రయోగాలు నిర్వహించినట్లు వివరించారు. ఈ వర్క్‌షాపునకు డివిఎన్. సుకన్య జె.కవిత కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. ముగింపు సభలో ఇసిఇ విభాగం అధ్యాపకులు, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలపై విచారణ జరపాలి

మాజీ కౌన్సిలర్లు శ్యామబాబు, వెంకట సాయిబాబు

ప్రజాశక్తి - చీరాల

మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్లు

జాతీయ రహదారి నిర్మాణంతో భూమి రేట్లు పెరుగడంతో తమకు చెందిన భూమికి కొందరు నకిలీ డాక్యుమెంట్లు సష్టించి, ఉన్నత అధికారులను తప్పు ద్రోవ పట్టిస్తూ తాము భూకబ్జాలకు , బెదిరింపులకుపాల్పడినట్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పిర్యాదు చేయడం పట్ల మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు శీలం శ్యామ్ బాబు ,పంచుమర్తి వెంకట సాయి బాబు ఆవేదన వ్యక్తం చేసారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. తాము ఇద్దరమూ కలిసి 2011 సంవత్సరంలో నాశన చంద్రశేఖర్ వద్ద 65 సెంట్ల భూమిని ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ భూమి పై సర్వ హక్కులు కలిగిన నాశన చంద్రశేఖర్, అతని కుమారుల చేత చట్టప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి తాము ఆ భూమిని సాగు చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల పిడుగురాళ్ల - వాడరేవు జాతీయ రహదారి అటుగా నిర్మిస్తున్న క్రమంలో అక్కడి భూములకు భారీగా ధరలు వచ్చినల్లు తెలిపారు. ఈ క్రమంలో తమ పొలానికి పెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో పరిశా మురళీ ప్రసాద్ దంపతులు ఆ భూమి తమదని తమను అడ్డుకున్నట్లు తెలిపారు. పొలంలో సాగుచేసిన మొక్కలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. వారు నకిలీ ధ్రువీకరణ పత్రాలను ఉన్నత అధికారులకు చూపుతూ వారిని తప్పుదోవ పట్టిస్తు తమపైన అసత్యమైన ఆరోపణలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఉన్నతాధికారులు భూమి చట్ట ప్రకారం ఎవరిదో ? తేల్చి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

సుధాలక్ష్మిని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - నిజాంపట్నం : నిజాంపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న పి.సుధా లక్ష్మి ఉత్తమ స్టాఫ్ నర్స్‌గా ఎంపికయ్యారు. 76వ గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆమె ఉత్తమ అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. అందులో భాగంగా అవార్డు గ్రహీత సుధాలక్ష్మిని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చిన్న గురువులు, డాక్టర్ శ్రీపతి, డాక్టర్ అనూష, నర్సులు, వైద్య సిబ్బంది బుధవారం సన్మానించారు.

కళాశాలలో 'స్వచ్ఛభారత్'

ప్రజాశక్తి - రేపల్లె : విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సామాజిక సహ కలిగించడానికి ఎన్ఎస్ఎస్ శిబిరాలు దోహద పడుతాయని ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టిసి. రవిచంద్రకుమార్ తెలిపారు. స్థానిక ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వాలంటీర్లు స్వచ్ఛ భారత్ పచ్చదనం, స్వచ్ఛ పరిశుభ్రత కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి చంద్రకుమార్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రా ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులు క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.దాసు, కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ బుజ్జి బాబు, బాల గురవయ్య, కెమిస్ట్రీ విభాగ అధిపతి బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీ పురంధరదాసుకు నివాళి

ప్రజాశక్తి - అద్దంకి : కన్నడ పద కవితా పితామహుడు శ్రీ పురంధరదాసు 461వ ఆరాధన బుధవారం ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు మరియు శ్రీ దాస భారతీయ జానపద కళాక్షేత్రం ఆధర్యంలో అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పురంధరదాసు విగ్రహానికి సాహితీ పెద్దలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెన్నుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ పురంధరదాసు విగ్రహం అద్దంకి లో ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు.. తన కీర్తనలు పండితులకు, పామరులకు అర్ధమయ్యే విధంగా, అందరూ పాడుకునే రీతిలో పురంధరదాసు రచించినట్లు తెలిపారు. విశ్రాంత ఆర్‌జెడి యు. దేవపాలన మాట్లాడుతూ పురంధరదాసు 2వ విగ్రహం దేశంలోనే అద్దంకిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు నీలంరాజు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి తెలిపారు. అద్దంకి మాజీ సర్పంచి చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, ప్రముఖ కవి చెన్నుపాటి రామాంజనేయులు, గోగుల వీరాంజనేయులు, మల్లయ్య, గురుస్వామి,ప్రముఖ కార్టూనిస్టు బత్తుల బాలు, జ్యోతి రమేష్ బాబు , దానయ్య, షేక్ జాన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సిఐ శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న దర్గా కమిటీ నాయకులు

రూరల్ సిఐ శ్రీకాంత్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు రూరల్ సర్కిల్ ఆఫీస్ పరిధిలోని పెద్దకొత్తపల్లిలో శ్రీ కరిముల్లాషా ఖాదరిదర్గా ఉరుసు మహోత్సవం ఈ నెల 26న విజయవంతంగా నిర్వహించారు. ఈ మహోత్సవం విజయవంతం కావడానికి ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు పటిష్టమైన బందోబస్తు నిర్వహించిన ఒంగోలు రూరల్ సిఐ ఎన్.శ్రీకాంత్‌బాబును దర్గా కమిటీ సేవా బృందం బుధవారం ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా బందోబస్తు నిర్వహించిన పోలీసు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సేవా బృందం సభ్యులు మరిపూడి చంద్రబాబు, షేక్ మస్తాన్, షేక్ మస్తాన్‌వలీ, రాజారెడ్డి, షేక్ గౌస్‌బాషా, ఎస్‌కె.చాంద్‌బాషా, షేక్ జబీర్ తదితరులు పాల్గొన్నారు.

గౌడలకు ఒక మద్యం షాపు: ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

యర్రగొండపాలెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని పుల్లలచెరువు మండలానికి కల్లు గీత కార్మికులకు ఒక మద్యం షాపు మంజూరైనట్లు ఎక్సైజ్ సీఐ సిహెచ్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ మద్యం షాపుకు గౌడ కులస్తులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులకు ఫిబ్రవరి నెల 5వ తేది సాయంత్రం 5 గంటలులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తులను యర్రగొండపాలెం పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో స్వీకరిస్తామన్నారు. ఈ నెల 7వ తేదీన ఒంగోలులో కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సమక్షంలో లాటరీ తీసిన అనంతరం మద్యం దుకాణాన్ని కేటాయించనున్నట్టు తెలిపారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఏకల్ అభియాన్ ట్రైబల్ సొసైటి ద్వారా చార్టులు, బ్లాక్ బోర్డులు, చీరలు, చొక్కా, ఫ్యాంట్‌లు, టవళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం బుధవారం యర్రగొండపాలెం పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా ఏకల్ అభియాన్ ట్రైబల్ సొసైటి అధ్యక్షుడు బి వెంకటేశ్వర్లు నాయక్ మాట్లాడుతూ ఆచార్య మాతాజీలకు ఏకల్ అభియాన్ ట్రైబల్ సొసైటి ద్వారా చార్టులు, బ్లాక్ బోర్డులు, చీరలు, చొక్కా, ఫ్యాంట్‌లు, టవళ్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ ప్రముఖ్ బాలు నాయక్, అభియాన్ ప్రముఖ్ సుబ్బారావు, ప్రశిక్షణా ప్రముఖ్ వి శ్రీనివాసాచారి, యర్రగొండపాలెం సాదక్ సుబ్బయ్య, యర్రగొండపాలెం సంచ్ ప్రముఖ్ రమణమ్మ, త్రిపురాంతకం సంచ్ ప్రముఖ్ ఎం శ్రీను పాల్గొన్నారు.

చిన్నదోర్నాల పాఠశాలకు చేయూత

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని చిన్న దోర్నాల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అభివద్ధికి అహర్నిశలు కషి చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండ్ల శ్రీనివాసులును అభినందిస్తూ బుధవారం పెద్ద దోర్నాల పంచాయతీ కార్యదర్శి నలగటి శివ కోటేశ్వరరావు రూ.20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ నిధులను పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకీటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కొండా అశోక్ అనే దళితుడిపై పెత్తందారులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈయన యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుడుని బుధవారం ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు మండాది పీటర్ మాదిగ పరామర్శించారు. జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా మండాది పీటర్ మాదిగ మాట్లాడుతూ ఇప్పటి వరకు పోలీసులు కేసు నమోదు చేయకపోవడం బాధాకరమని, వెంటనే కొండా అశోక్‌పై దాడి చేసిన పెత్తందారులపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్ పిఎస్ నాయకులు బరిగల దాసు, ముటుకూరి రాజ్ కుమార్, కృపయ్య, అచ్చిబాబు, మోషేతో పాటు మానేపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

'సంత'ను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి గొర్రెల మండిలో నిర్వహిస్తున్న సంతను జిల్లాలోని గొర్రెలు, మేకలు పెంపకందారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా తెలియజేశారు. బుధవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఒంగోలు మార్గంలో పొగాకు బోర్డు ఎదురుగా గల గొర్రెల మండిలో సంతను ఆమె ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి ప్రారంభించి.. పరిశీలించారు. గొర్రెలు, మేకల పెంపకందారులతో మాట్లాడారు. దూరప్రాంతాలలో ఉండే సంతకు వెళ్లడం వ్యయప్రయాసలతో కూడిన పని అని, కనిగిరిలో దగ్గరగా ఉండటం ప్రయోజనకరంగా ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గొర్రెల మండిని ఏర్పాటుచేయడమే కాకుండా అందులో సంతను ప్రారంభించడంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కృషి అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కనిగిరిలో గొర్రెల మండిని నిర్మించడం జరిగిందని, ఆ తరువాత 12 సంవత్సరాల పాటు గొర్రెల మండి వినియోగంలోకి రాకుండా ఉండిపోయిందని చెప్పారు. అందుకు అప్పటి పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. తిరిగి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత సంతను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ గొర్రెల మండిలో గొర్రెలు, మేకల పెంపకందారులు విక్రయాలు జరుపుకొని.. ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవకాశం కలుగుతుందని

సంతను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తెలిపారు. జిల్లా గొర్రెల సహకార సంఘం అధ్యక్షులు తోడేటి గోపి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులందరూ కషిచేసి గొర్రెల మండిని, సంతను అభివద్ధి చేయాలని సూచించారు. త్వరలో ఇక్కడ మాంసం పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గొర్రెల సహకార సంఘం సభ్యులు నంబుల కొండయ్య, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, టిడిపి పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసరెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, టిడిపి నాయకులు ముచ్చుమారి చెంచిరెడ్డి, తమ్మినేని వెంకట్‌రెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసరెడ్డి, పచ్చవ వెంకటేశ్వర్లు, గుదే రమణయ్య, క్రాంతి శీను, గంగవరపు నాగిరెడ్డి, బాలు ఓబుల్ రెడ్డి, తమ్మినేని సురేంద్ర, గుడిపాటి ఖాదర్, సిహెచ్ నాగార్జున యాదవ్ పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తుకు భరోసా

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి -కనిగిరి

బాల్య వివాహాలను నివారించి.. సాధికారత దిశగా బాలికలను ఎదగనిద్దామని, బాలల భవిష్యత్తుకు భరోసా కల్పిద్దామని కలెక్టర్ తమీమ్‌అన్సారియా తెలి పారు. కనిగిరి పట్టణంలోని షాదీఖానాలో బుధవారం బంగారు బాల్యం కార్యక్రమంలో కనిగిరి డివిజన్ పరిదిలోని ఎంపీడీవోలు, ఎంఈఓలు, సిడిపిఓలు, అంగన్వాడి సూపర్వైజర్లకు డివిజన్ స్థాయి ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం, విద్య, సమగ్ర ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. కనిగిరి ఎమ్మెల్యే

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ బాలి కల విద్య, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవ కాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బంగారు బాల్యం కార్యక్ర మాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డిఎల్‌డిఓ కె.శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు గ్రీన్‌సిగ్నల్

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వెనుకబడిన కులాలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి స్వయం ఉపాధి కల్పనకు గురువారం నుంచి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కలిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రకాశం జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంస్థ ద్వారా బీసీ, ఈబీసీ, కాపు కులాల నిరుద్యోగ యువత ఆన్లైన్ పద్ధతి ద్వారా నేటి నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన అభ్యర్థులు 'ఆన్లైన్ బెనిఫిషియరీ మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టం' (ఓబిఎంఎంఎస్) పోర్టల్ నుంచి ఫిబ్రవరి ఏడో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి.

8 నుంచి అర్హుల జాబితా ఎంపిక..

ఫిబ్రవరి 8 నుంచి 12వ తేదీ ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవోతో పాటు నిర్దేశించిన బ్యాంక్ అధికారులు కమిటీగా వ్యవహరిస్తారు. మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు బ్యాంక్ అధికారులు కమిటీగా ఉంటారు. ఈ కమిటీలు దరఖాస్తులను పరిశీలిస్తాయి. ఫిబ్రవరి 12 నుంచి 14వ తేదీ వరకు కింది స్థాయిలో ఫీల్డ్ వెరిఫికేషన్ చేపడతారు. అనర్హులను తొలగించి అర్హుల జాబితా తయారు చేస్తారు. 15, 16 తేదీల్లో అర్హుల జాబితాను బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు పంపిస్తారు. కాగా ఫిబ్రవరి 21 నుంచి 23 వరకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అర్హుల తుది జాబితాను సిద్ధం చేస్తారు. ఫిబ్రవరి 26 నుంచి 28 వరకు ఆయా మండలాలు పట్టణాలలో ఎంపిక చేసిన బ్యాంకుల ద్వారా సబ్సిడీ అమౌంట్‌ను విడుదల చేస్తారు.

పది నుంచి రుణమేళాలు..

2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 'చంద్రన్న స్వయం ఉపాధి పథకం' పేరున చేపట్టిన స్వయం ఉపాధి యూనిట్లను మార్చి పదో తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఇన్చార్జి మంత్రి, జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులు ఇతర ప్రజా ప్రతినిధులు అతిథులుగా హాజరవుతారు. ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ఈ పథకం కింద ఎంపికైన అన్ని యూనిట్లకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను జియో ట్యాగింగ్ పద్ధతిలో రికార్డు చేస్తారు. ఏప్రిల్ 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రౌండ్ లెవెల్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు.

ట్యాంకుని ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి

ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని మొగుళ్లపల్లి ఎస్సీపాలెంలో తాగునీటి సమస్య అధికంగా ఉండేది. అయితే సమస్యను పరిష్కరించేందుకు వైసిపికి చెందిన సర్పంచ్ కర్నాటి వెంకటేశ్వరరెడ్డి నడుం కట్టారు. ఎస్సీపాలెంలో బోరు వేయించారు. బోరుకు అనుసంధానం చేస్తూ కాలనీకి గల నాలుగు వీధుల్లోనూ పైపులైన్లు వేయించారు. నీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రతి వీధిలో వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన నీళ్ల ట్యాంకులను ఏర్పాటు చేశారు. బుధవారం సర్పంచ్ ట్యాంకులకు, కుళాయిలకు నీళ్లు వదిలి.. ఎస్సీ కాలనీకి నీటి సరఫరాను ప్రారంభించారు. దీంతో ఆ కాలనీకి మంచినీటి సమస్య తీరింది. ఈ సందర్భంగా మొగుళ్లపల్లి సర్పంచ్ కర్నాటి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కాలనీవాసుల ఇబ్బందులు పరిష్కరించేందుకు బోరుకు అనుసంధానంగా పైపులైన్ వేయించడంతో పాటు వీధులలో కుళాయిలను ఏర్పాటు చేసి ప్రతి వీధికి వెయ్యి లీటర్లు సామార్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకులను ఏర్పాటు చేశామన్నారు.

వై.కొత్తపల్లిలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పాడి రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ రమేష్ తెలిపారు. బుధవారం యర్రగొండపాలెం పంచాయితీ పరిధిలోని వైకొత్తపల్లి గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 185 దూడలకు, ఆవులకు 2750 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది షేక్ షబ్బీర్, నారాయణ, షేక్ ముజీద్, ఎం యల్లారెడ్డి, షేక్ బాజీ షరీఫ్, వలి తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో శేషారెడ్డి

గంజివారిపల్లిలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి, వెంకటాద్రిపాలెం గ్రామాలలోని గ్రామ రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లో ఉన్న రైతులతో కలిసి సాగు చేస్తున్న, కంది, పొగాకు, ఉలవ పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల వద్ద గ్రామసభ నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కెవి శేషారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి యాల్ మాల్యాద్రి, సిబ్బంది మీరావలి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండలంలోని ఎగువ చెర్లోపల్లి, చిలకచర్లగూడెంలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి డి జవహర్ లాల్ నాయక్ గ్రామాలలో సాగు చేసిన మొక్కజొన్న, మినుము, మిరప పంటలను సందర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి చైతన్య కుమార్, విఎస్‌ఎ షేడ్రాక్ బాబు, డిడబ్ల్యుఎస్ ఎన్జీవో ప్రతినిధి బాలరాజు పాల్గొన్నారు.

మిరప తోటలకు నల్లి తెగులు

◆ పూర్తిగా తగ్గిన మిర్చి ధరలు ◆ ఎకరానికి రూ.50వేలు నష్టం వస్తుందని రైతులు దిగాలు

మిరప కల్లాలలో మిరప కాయలను గ్రేట్ చేస్తున్న రైతులు కూలీలు

ప్రజాశక్తి-దర్శి

గతేడాది మిర్చి పంట ధరలు క్వింటా రూ.20వేల నుండి రూ.21వేలు పలకడంతో ఈడాది రైతులు బోర్ల కింద ఎక్కువగా మిర్చి పంట సాగు చేశారు. మండలం లోని వెంకటాచలంపల్లి, నడింపల్లి, అబ్బాయిపాలెం, చలివేంద్ర, పోతవరం, చందలూరు, బసిరెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు వెయ్యి ఎకరాల వరకు మిర్చి సాగు చేశారు. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి పెట్టారు. తీరా పంట చేతికి వచ్చే సమయంలో గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది వైరస్ రావడంతో చెట్లన్నీ ముడుచుకుపోయి ఒక కోతకే పంట అయిపోయిందని రైతులు వాపోతున్నారు. గతేడాది అన్నిటి కంటే ఎక్కువ ఆదాయం మిర్చి పంటకు రైతులకు వచ్చిందని రైతులు చెబుతున్నారు. రైతు లక్ష్మీనారాయణ ఎకరానికి రూ.2లక్షల వరకు మిగిలినట్లు చలివేంద్ర గ్రామానికి చెందిన రైతు బూచిరాజు గోవింద య్య, దారం వెంకటేశ్వరరెడ్డి భార్య సుప్రియ తెలిపారు. ఈ సందర్భంగా బూచిరాజు గోవిందయ్య మాట్లాడుతూ తాను ఎకరం మిరప పంట సాగు చేశానని, ఇప్పటికే రూ.లక్ష పెట్టుబడి పెట్టానని తెలిపారు. అయితే వైరస్ రావడంతో పంట దిగుబడులు బాగా తగ్గాయని అన్నారు. నల్లి తెగులు కూడా రావటంతో పూర్తిగా దిగుబడులు తగ్గిపోవడంతో నష్టాలు తప్పవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 100 గ్రాములు మందు రూ.3వేలతో ఖర్చు పెట్టి స్ప్రే చేసినప్పటికీ ఫలితాలు లేవన్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సలహాలు చెప్పిన విధంగా చేసినప్పటికీ ఏమి ఉపయోగం లేదని దారం వెంకటేశ్వర్‌రెడ్డి భార్య సుప్రియ తెలిపారు. గతేడాది మిర్చి పంటపై లాభ సాటిగా ఉండటంతో ఈ ఏడాది 5 ఎకరాలు మిర్చి పంట వేశామని, ఇప్పటికీ రూ.5లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. అయితే వైరస్ రావడంతో ఒక కోత మాత్రమే కోశామని తెలిపారు. ఐదు ఎకరాలలో కలిపి 30 క్వింటాళ్ళు వరకు ఒక కోతకు దిగుబడి వచ్చిందని, దానికి గ్రేడ్ చేయడానికి కూలీలకు ఒక్కొక్కరికి రోజుకు రూ.400లు చొప్పున గ్రేడ్ చేస్తే ఎనిమిది మంది పడుతున్నట్లు తెలిపారు. కోతకు, గ్రేడుకు కలిపి దాదాపుగా రూ.8 వేలు కూలీ అవుతుందని తెలిపారు. మిర్చి యార్డుకు పోయిన రైతులకు మాత్రం ఏడాది రూ.12వేల నుండి రూ.14వేల వరకు మిర్చి రేటు వేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కోసిన కోత కాకుండా ఇంకో కోత మాత్రమే కోసే అవకాశాలు ఉన్నదని తెలిపారు. దీనితో ఎకరానికి 10 నుండి 15 కింటాలు మాత్రమే పంట దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. అన్ని ఖర్చులు పోను ఎకరానికి రూ.లక్ష నుండి రూ.1.50లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఐదు ఎకరాలకు కలిపి రూ.7లక్షలు వరకు ఖర్చు అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎకరానికి 10నుండి 12క్వింటాళ్ళ లోపే దిగుబడ్లి వస్తాయని తెలిపారు. ఎకరానికి 10 క్వింటాళ్ళు అమ్మితే రూ.1.20లక్షలు అమ్ముతాయని, ఖర్చులు మాత్రం దాదాపు రూ.1.50లక్షలు వస్తుందన్నారు. ఎకరానికి రూ.30 వేల నుండి రూ.50 వేల వరకు నష్టం వచ్చే అవకాశాలు ఉన్నట్లు రైతులందరూ వాపోతున్నారు. ఈ ఏడాది మిర్చి పంట ధరలు తగ్గడంతో వైరస్ రావడంతో నళితెగులు రావడంతో రైతులు అప్పులు బారిన పడే అవకాశాలు ఉన్నట్లు పలువురు రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో రైతులకు రూ.13500 పెట్టుబడి సాయంగా ఇచ్చారని, ఏడాది కేంద్ర ప్రభుత్వ విచ్చిన రూ.2వేలు మాత్రమే వచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మిర్చి రైతులు కోరుతున్నారు.

వైరస్ వచ్చిన మిరప తోటకు నీరు పెడుతున్న రైతు బూచిరాజు గోవిందయ్య

ఇస్రో చైర్మన్ నారాయణన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-దర్శి

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రపంచ దేశాలు గర్వపడేలా శ్రీహరికోట నుండి జిఎస్ఎల్‌వి-ఎఫ్15 నావిక్ 2'ను 100వ ఉపగ్రహాన్ని అంతరక్షంలోకి దిగ్విజ యంగా పంపించి ఘన విజయాన్ని సొంతం చేసికొన్న సందర్భంగా మండలంలోని తూర్పువెంకటాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కన్వీనర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి ఎగ్జికూటివ్ మెంబరు కపురం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఇస్రో చైర్మన్ వి నారాయణన్ చిత్రపటానికి పాలాభిషేకం బుధవారం చేశారు. 350మంది విద్యార్థులందరూ కలసి ఘనంగా విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రకాష్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో మానవత సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, కపురం శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. అంతరిక్ష పరిశోధనలో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. విద్యార్థులు అందరూ మిఠాయిలు పంచుకొని జయహో భారత్ అంటూ నినాదాలు చేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యా కమిటీ చైర్మన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్రో చైర్మన్ నారాయనన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మానవత ప్రతినిధులు

సంస్కృతి విద్యాసంస్థలో ఫుడ్ పాయిజన్ కాలేదు

ప్రజాశక్తి-దర్శి

స్థానిక గౌతమి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడిచే సంస్కృతి విద్యాసంస్థలో ఎలాంటి ఫుడ్ పాయిజన్ కాలేదని మెడికల్ అండ్ హెల్త్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక అద్దంకి రోడ్‌లోని సంస్కృతి విద్యాసంస్థలను ఆయన బుధవారం పరిశీలించారు. గౌతమి విద్యా సంస్థల ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు రెండు రోజులపాటు ఇటీవల జరిగాయి. ఆ సందర్భంగా 30 మంది అస్వస్థకు గురై మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. వైద్యులు వారిని పరీక్షించి నలుగురికి మాత్రమే జ్వరాలు ఉన్నట్లు నిర్ధారించారని డిఎంఅండ్ హెచ్ఓ తెలిపారు. ఈ సందర్భంగా ఒక పత్రికలో వచ్చిన దానిని దృష్టిలో పెట్టుకొని బుధవారం పాఠశాలను తనిఖీ చేసామని, అందరూ విద్యార్థులు ఆరోగ్యంగానే ఉన్నారని, ఎలాంటి ఫుడ్ పాయిజన్ కాలేదని, రెండు రోజులు పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉండి మంచులో తడిసినందువలన అందరికీ ఒళ్ళు నొప్పులు, జలుబు వచ్చాయని తెలిపారు. అందులో నలుగురికి మాత్రమే జ్వరం వచ్చినట్లు వైద్యులు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. అందరూ సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటినుండి దోమలు వచ్చే అవకాశాలు ఉన్నందున దోమతెరలు వాడాలన్నారు. మాస్కులు ధరించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చేతన ఆధ్వర్యంలో సంస్కృతి విద్యాలయంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అందరూ విద్యార్థులు ఆరోగ్యంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగేంద్రబాబు, సంస్కృతి ప్రధానోపాధ్యాయులు, హెల్త్ సిబ్బంది ఉన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

నేటి నుండి రుణాల దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - వెలిగండ్ల

మండలంలోని 21 పంచాయతీల్లో బీసీ కార్పొరేషన్, జనరిక్ మెడికల్ షాపులకు, ఈడబ్ల్యూఎస్ పథకాలకు సంబంధించిన రుణాల మంజూరుకు అర్హత ఉన్న లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఒ షేక్ మహబూబ్ బాషా ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ నెల 30న గురువారం ఉదయం నుండి ఫిబ్రవరి 7వరకు దరఖాస్తు చేసుకోచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఓబిఎంఎంఎస్ ఆన్లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి సమాచారం కోసం పరిధిలోని సచివాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఎంపిడిఓ షేక్ మహబూబ్ బాషా

పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న డిఎం అండ్ హెచ్ఓ వెంకటేశ్వర్లు

మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి-తాళ్ళూరు

ప్రజలకు సరైన సౌకర్యాలు, వైద్యం సక్రమంగా అందించే విధంగా చర్యలు చేపట్టాలని వైద్య, ఆరోగ్య జిల్లా అధికారి జె వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్ఇడి 3సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో హెల్త్ సర్వేలు గురించి ఆరా తీశారు. వైద్యశాల సంతృప్తికరంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట డాక్టర్ కె మౌనిక, శ్రీకాంత్‌రెడ్డి, హెచ్ఇ కె చంద్రశేఖర్, పిహెచ్ఇ ఎన్ రమణమ్మ, హెచ్‌డి సుశీల పాల్గొన్నారు.

భైరవకొనలో పూజలు చేస్తున్న భక్తులు

భైరవకోనలో భక్తుల పూజలు

ప్రజాశక్తి-సిఎస్.పురం

జిల్లాలో ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రమైన భైరవకోనలో బుధవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జలపాతాన్ని వీక్షించి కాలభైరవ స్వామి, త్రిముఖ దుర్గాదేవి, శివలింగాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇఓ వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ళ శ్యాంసుందర్‌రాజు ఆదేశాల మేరకు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

మురికి కూపంగా ఎస్‌సి కాలనీలోని సైడ్ కాలవలు

అధ్వానంగా ఎస్సీ కాలనీలో కాలువలు

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని రాజంపల్లి గ్రామంలో దర్శి, పొదిలి రోడ్డు గుండా మాదిగపల్లి పోయే ఎస్సీ కాలనీలో రోడ్లు మురికి కూపంగా మారాయి. పల్లెలో ఉన్న రోడ్లన్నీ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీనిని పట్టించుకున్న నాథుడు లేక ప్రజల అవస్థలు పడుతున్నారు. ఆ గ్రామంలోని గోళ్లపాటి రోశయ్య, గుంటి రూబేను మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను పట్టించుకోనందువలన మురుగు కాలువలలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో విష జ్వరాలు సోకి పెద్దలు, పిల్లలు ఆసుపత్రి పాలవుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ పట్టించుకుని నాధుడులేడని కాలనీవాసులు వాపోతున్నారు. పంచాయితీ అధికారులు స్పందించి ఇప్పటికైనా గ్రామంలో సైడ్ కాలువలోని చెత్తా, చెదారం తొలగించి శుభ్రం చేయాలని, అంటువ్యాధులు, విషజ్వరాల బారి నుండి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజకీయ కక్షతో చికెన్ దుకాణం కూల్చివేత

ఘటనా స్థలాన్ని పరిశీలించిన వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి- భట్టిప్రోలు

టిడిపి నాయకుల రాజకీయ కక్ష, ఒత్తిడితో పంచాయతీ అధికారులు ఓ చికెన్ దుకాణాన్ని కూల్చివేశారు. ఈ ఘటన మండల పరిధిలోని పల్లెకోన గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కేశన శ్రీనివాసరావు తోటి వ్యాపారుల మాదిరిగానే రహదారి వెంబడి ఆర్అండ్‌బి స్థలంలో సుమారు 15 సంవత్సరాల క్రితం చికెన్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. విద్యుత్ బిల్లులు, పంచాయతీ పనులు చెల్లిస్తూ వ్యాపారం చేసుకుంటూ తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే గ్రామపంచాయతీ అధికారి మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో హడావిడిగా నోటీసు జారీ చేశాడు. బుధవారం ఉదయానే మరో గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికులను పిలిపించి దగ్గర ఉండి మరి చికెన్ దుకాణాన్ని కూల్చి వేసియినట్లు బాధితుడు ఆరోపించారు. తాను వైసిపికి అనుకూలమని టిడిపి నాయకులు తనపై కక్షగట్టినట్లు తెలిపారు. టిడిపి నాయకుల ప్రోద్బలంతో పంచాయతీ కార్యదర్శి తన దుకాణాన్ని కూల్చి వేయించినట్లు తెలిపారు. గ్రామంలో అనేక షాపులు ఉండగా తన దుకాణాన్ని మాత్రమే తొలగించారని ఆయన వాపోయాడు. నోటీసు జారీ చేసి కొన్ని రోజుల పాటు సమయం కూడా ఇవ్వకుండా తొలగించటం పట్ల తమ కుటుంబం రోడ్డున పడిందని ఆయన బోరున విలపించాడు.

చికెన్ దుకాణాన్ని కూల్చి వేస్తున్న పంచాయతీ సిబ్బంది

కార్యదర్శికి మామూళ్లు ఇవ్వనందుకే : శ్రీనివాసరావు

పంచాయతీ కార్యదర్శి మామూళ్లుఇవ్వాలని కోరినట్లు శ్రీనివాసరావు తెలిపారు. తాను మామూళ్ల ఇవ్వకపోవడంతో తనపై కక్ష కట్టి తమ దుకాణాన్ని కూల్చి ధ్వంసం చేయించినట్లు తెలిపారు. ఏదైనా కార్యక్రమం జరిగినప్పుడల్లా కార్యదర్శి తమకు 10 కేజీలు, 20 కేజీల చికెన్ పంపించాలని వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. తాను చికెన్ ఇవ్వక పోవడంతో తనకు బతుకు దెరువు లేకుండా చేశారని ఆయన వాపోయాడు. చికెన్ దుకాణం తొలగించిన విషయం గురించి తెలుసుకున్న వైసిపి వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త,వరికూటి అశోక్ బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దుకాణం తొలగింపుపై తహశీల్దారు మేక శ్రీనివాసరావు, ఎంపిడిఒ వెంకటరమణ, ఎస్ఐ శివయ్య దృష్టికి తీసుకెళ్లారు. బాధితుడికి న్యాయం చేయాలని కోరారు.

టిడిపి అరాచకాలు ఆపక పోతే ఆందోళన చేపడతాం

కూటమి ప్రభుత్వ పాలనలో వైసిపి నాయకులు కార్యకర్తలపై అరాచకాలు పెరిగిపోయాయని వాటిని ఆపక పోతే ఆందోళన చేపడతామని వరికూటి అశోక్ బాబు హెచ్చరించారు. వైసిపి కార్యకర్తలు టార్గెట్ చేసుకొని వారికి సంబంధించిన ఆస్తులను ధ్వంసం చేస్తున్నట్లు తెలిపారు. పల్లెకోన గ్రామంలో ఆర్అండ్ బి రహదారి వెంబడి అనేక మంది దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అయితే వైసిపి చెందిన శ్రీనివాసరావు చికెన్ స్టాల్ మాత్రమే తొలగించడం కక్ష సాధింపు చర్య అని విమర్శించారు. ఆర్ అండ్ బికి చెందిన స్థలానికి పంచాయతీ అధికారి ఏ విధంగా నోటీసులు జారీ చేసి తొలగిస్తారని ఆయన ప్రశ్నించారు. చికెన్ స్టాల్‌ను ధ్వంసం చేసిన కార్యదర్శి శ్రీనివాసరావు పై కేసు నమోదు చేయాలని ఎస్ఐను కోరారు. బాధితుడికి న్యాయం జరగకపోతే వైసిపి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టాల్సి వస్తుందని అశోక్ బాబు హెచ్చరించారు. అశోక్‌బాబు వెంట ఎంపిపి డివి. లలిత కుమారి, పల్లెకోన గ్రామ సర్పంచి బుల్లెద్దు రాజమ్మ ప్రతాప్, నాయకులు జోషికాంత్, శ్రీనివాసరావు, ప్రభు, నాగేశ్వరరావు, చిన్నారి ఉన్నారు.

సత్యనారాయణను సన్మానిస్తున్న స్థానికులు

విద్యాభివృద్ధికి కృషి : గూడూరు

ప్రజాశక్తి - పంగులూరు.

పంగులూరు ప్రాంతంలోని కమ్మ సామాజిక వర్గ పిల్లల విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు కాకతీయ ఫౌండేషన్ నాయకులు గూడూరు సత్యనారాయణ తెలిపారు. పంగులూరులో కాకతీయ విద్య ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాన్ని సత్యనారాయణ, జగదీష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, కమ్మ సామాజిక వర్గానికి సంబంధించి తల్లి లేదా తండ్రి మరణించిన విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కోసం కాకతీయ విద్యా ట్రస్టు 2025 -26 విద్యా సంవత్సరానికి 6, 7 ,8, తరగతుల విద్యార్థులకు ఉచిత విద్యా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. తమ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్య, ఉచిత భోజనం ,కమ్యూనిటీ కిచెన్ సెంటర్, క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గూడూరు సత్యనారాయణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి శ్రీధర్ లక్ష్మి రత్నకుమారి శ్రీనివాసరావు, దేవి., విశ్రాంత ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, చిలుకూరి వీరరాఘవయ్య, తలపనేని రామాంజనేయులు, బాచిన రత్నకుమారి, హేమలత పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో అధికారుల తనిఖీ

ప్రజాశక్తి- వేమూరు

జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వేమూరులోని శ్రీ సాయి బాలాజీ రైస్ మిల్లులో పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులోని ధాన్యం నిల్వలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతుల నుంచి ఎంత కొనుగోలు చేశారు? వ్యక్తిగతంగా ఎంత కొనుగోలు చేశారు? ఏఏ ధరలకు కొనుగోలు చేశారనే విషయాలపై ఆరా తీశారు. రికార్డులు అన్ని పరిశీలించి పూర్తి నివేదిక ఉన్నతాధికారులు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సుశీల, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం దివాళా

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -రేపల్లె

జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని విధాల దివాలా తీసినట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ జల్సాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. టిడిపి అధికారంలోనికి వచ్చేనాటికి జగన్మోహన్ రెడ్డి వివిధ సంక్షేమ పథకాలకు రూ. 1,40,000 కోట్ల రూపాయలు ప్రజలకు చెల్లించలేదన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు, ఉపాధి హామీ పథకం చెల్లింపులు ఇతర బిల్లులు కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా రూ.1,40,000 కోట్ల రూపాయల పెండింగ్‌లో పెట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ చేసిన అప్పులు తీర్చుకుంటూ, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్ర అభివద్ధికి బాటలు వేస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. అవినీతి, అక్రమాలతో, అడ్డగోలుగా పాలించిన జగన్ రాష్ట్రాన్ని నిలువునా దోపిడీ చేశాడని ఆరోపించారు. గత ఐదేళ్లలో జగన్ రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారని మండిపడ్డారు. జగన్ రెడ్డి చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ పంతాన్ని మురళీధరరావు, మంత్రి వ్యక్తిగత సహాయకులు ధర్మతేజ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండల పరిధిలోని పాతమాగులూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ లావణ్య రైతులతో కలిసి మిరప, వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ప్రోక్లయిన్ మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి జిర్రా విజయ్ బాబు, వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి : రైతులు పురుగుమందుల వినియోగం తగ్గించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ తెలిపారు. మండల పరిధిలోని తిమ్మాయపాలెం, రామాయపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ రసాయన రహిత వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ,గ్రామ వ్యవసాయ సహాయకులు ఖాజావలి, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు,పరిటాల నాగరాజు పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న అధికారులు

మార్టూరు : రబీ సీజన్ పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఎఒ బి. అంజిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోనిబొల్లాపల్లి తాటివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎఒ రైతులతో కలిసి శనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ఇమా మెక్టిన్ బెంజోమేట్ ఎకరాకు 80 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వివిఎ శ్రీ చైతన్య, రైతు సంఘం నాయకుడు వి. కష్ణమూర్తి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి-అద్దంకి

మండల పరిధిలోని మణికేశ్వరం గ్రామంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మండల పశువైద్యాధికారి అశోక్‌తో కలిసి ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులు, మూగజీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పశువులు, దూడలు,గొర్రెలు,మేకలకు నట్టల నివారణ మందు అందజేశారు. పశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, టిడిపి నేతలు బడావలి, మేకల ఆదినారాయణ,మౌలాలి, సిద్దయ్య, బలరామి రెడ్డి, అబ్దుల్లా, ఆంజనేయులు, వట్టెం కష్ట పంచాయతీ కార్యదర్శి మస్తాన్ వలి, వెటర్నరీ వెల్ఫేర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

నిజాంపట్నం : మండల పరిధిలోని దిండి గ్రామంలో పశుసంవర్ధక శాఖ, శ్రీ సత్య సాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణు గోపాల్ మాట్లాడుతూ పశువైద్య శిబిరాలు పాడి రైతులకు ఎంతోగానో ఉపయోగ పడతాయని తెలిపారు. అనంతరం శ్రీ సత్య సాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో పశుపోషకులకు మందులు, రైతులకు 100 జామ మొక్కలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏడీ బి.నాంచారయ్య, కూచినపూడి పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.హేమప్రియ, శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు శ్రీనివాసరావు, గోవర్ధన్, పున్నయ్య శాస్త్రి, సంగమేశ్వర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి- పంగులూరు

గర్భిణులు పోషకాహారం ఆహారం తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలను ఎక్కువగా తినాలని పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ బాల రాజేశ్వరి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు ఓరల్ గ్లూకోజ్ టోలోరెన్స్ పరీక్షలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాల రాజేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు బెల్లంతో తయారుచేసిన శనక్కాయల ముద్దలు తినాలన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత కనీసం రెండు గంటల పాటు నిద్రించాలన్నారు. గర్భంలో ఉన్న బిడ్డకు రక్తం పట్టాలంటే ఐరన్ టాబ్లెట్స్ మింగాలన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏదైనా అనారోగ్య సమస్య ఎదురైతే ఎఎంలు, ఆశా కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ భారతి, హెల్త్ ఎడ్యుకేటర్ అనురాధ, ల్యాబ్ టెక్నీషియన్ హరిచందన, స్టాఫ్ నర్స్ క్రాంతి, ఫార్మసిస్ట్ పద్మావతి, సూపర్వైజర్ అనూరాదేవి, హరిబాబు ,రాజారెడ్డి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇ-శ్రామ్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

అసంఘటిత రంగాల్లోని కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు భారత ప్రభుత్వం ఇ-శ్రమ్ యోజనను ప్రారంభించినట్లు సహాయ కార్మిక అధికారి జి.ప్రభాకర్ రావు తెలిపారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వ్యక్తి ప్రామిక్ కార్డ్ లేదా ఇ-శ్రమ్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇ-శ్రమ్ కార్డు ద్వారా అసంఘటిత రంగాల్లోని కార్మికులు మరియు కార్మికులు 60 సంవత్సరాల తర్వాత పెన్షను, మరణ బీమా పొంద వచ్చునని తెలిపారు. ఇ-శ్రమ్ కార్డు కావాల్సిన వారు కార్మిక కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు.

రహదారిపై గుంతలకు మరమ్మతులు

ప్రజాశక్తి - చీరాల

చీరాల మండలం ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ మానవత్వాన్ని చాటుకున్నాడు. విధి నిర్వహణ, సామాజిక సేవా కార్యక్రమంలోను తన వంతు కృషి చేస్తున్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఈపురిపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 216 జాతీయ రహదారిపై ఉన్న గుంతలను మరమ్మతులు చేయించారు. గుంతలకు మరమ్మతులు చేయించడం పట్ల వాహనదారులు, అధికారులు ఎస్ఐ చంద్రశేఖర్‌కు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర మహాసభల

జాతాలను జయప్రదం చేయండి

సిపిఎం పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఈ నెల 31న ఒంగోలు వస్తున్న సిపిఎం రాష్ట్ర మహాసభల జాతాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె. మాబు కోరారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ప్రచార జాతాలు మూడు ప్రాంతాల నుండి ఒంగోలు వస్తున్నాయని, ఈ సందర్భంగా జరిగే సభల్లో ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ విశాఖపట్నం నుండి, పోలవరం ప్రాజెక్ట్ సత్వరం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ కూనవరం నుంచి, రాజధాని అమరావతికి సంబంధించి, ప్రత్యేకహోదా, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తాడేపల్లి నుండి జాతాలు ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. మహాసభ నాటికి నెల్లూరుకు చేరే పతాక యాత్రలు ఒంగోలు వస్తున్నట్లు వివరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ జాతా 31 న ఉదయం 9-45 గంటలకు ఏ వన్ ఫంక్షన్ హాల్ దగ్గర నుంచి, గుంటూరు రోడ్డు, అద్దంకి బస్టాండ్ మీదుగా కలెక్టరేట్ వరకు రోడ్ షో నిర్వహించిన అనంతరం సభ ఉంటుందన్నారు. పోలవరం జాతా అదే రోజు సాయంత్రం 3-45 గంటలకు మంగమ్మ కాలేజీ దగ్గర నుంచి, బైపాస్ రోడ్, మంగమూరు రోడ్డు వరకు చేరుకున్న అనంతరం ఆర్‌కె ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్ద సభ నిర్వహిస్తామన్నారు. రాజధాని అమరావతి జాతా సాయంత్రం 4-45 గంటలకు ఏ1 ఫంక్షన్ హాల్ దగ్గర నుంచి, గుంటూరు రోడ్డు, అద్దంకి బస్టాండ్ మీదుగా సాగర హెూటల్ వరకు చేరుతుందని అనంతరం సాగర్ సెంటర్ లో సభ ఉంటుందన్నారు. సిపిఎం జిల్లా కమిటీ నగర కమిటీల ఆధ్వర్యంలో జరిగే ఈ సభలలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విమానాశ్రయం పనులు వేగవంతం చేయాలి

- కంభం చెరువు అభివృద్ధి, నృత్యకళాశాల ఏర్పాటు చేయాలి
- సిఎంను కోరిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కేంద్రమైన ఒంగోలులో విమానాశ్రయం పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. ఒంగోలులో మ్యూజిక్- నృత్య కళాశాల, గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం చెరువు అభివృద్ధితో పాటు చెరువులోని ఎనిమిది కొండలకు అష్టదిగ్గజాల పేర్లు పెట్టాలని సిఎంకు వినతిపత్రం అందజేశారు. ఉండవల్లిలో సిఎంను కలిసి ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలు వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు ప్రకటన చేసిన ముఖ్యమంత్రి, కేంద్ర విమానయాన శాఖ మంత్రికి ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి కతజ్ఞతలు తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటుపై కేంద్ర నిపుణుల బందం రాష్ట్ర నాయకులు, అధికారులతో కలిసి ఈనెల 22న ఒంగోలు సమీపంలోని అల్లూరు-ఆలూరు మధ్య ఉన్న 657 ఎకరాల స్థలాన్ని పరిశీలించామన్నారు. ఇందులో ప్రభుత స్థలం పోను మిగతా స్థలానికి కేవలం రూ.115 కోట్లు సరిపోతాయని, కేంద్ర పౌర విమానయాన మంత్రి, అధికారులతో సంప్రదించి విమానాశ్రయాన్ని మంజూరు చేయించాలని కోరారు. ఒంగోలు నగరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీక అని, భారతీయ సంగీత త్రయంలో, ఇద్దరు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కళాకారులు త్యాగరాజస్వామి, శ్యామ శాస్త్రి ప్రకాశం జిల్లాకు చెందినవారన్నారు. జిల్లాలోని ఔత్సాహిక విద్యార్థులు, కళాకారులకు నాణ్యమైన శిక్షణ ఇచ్చేందుకు సంగీతం, నృత్య విద్యల కళాశాలను ఒంగోలులో ఏర్పాటు చేయాలన్నారు. శ్రీకృష్ణదేవరాయల శకంలో గుండ్లకమ్మ - జంపలేరు నదుల నుంచి కంభం, బేస్తవారిపేట మండలాలలోని 19 గ్రామాలలోని 6,944 ఎకరాల ఆయకట్టుతో నిర్మించబడిన "ప్రపంచ వారసత్వ" కంభం చెరువు అభివద్ధికి రూ.9.585 కోట్లు మంజూరు చేయాలన్నారు. చెరువులో వున్న 8 చిన్న కొండలకు అష్టదిగ్గజాలు పేర్లు పెట్టాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

చంద్రబాబుతో ఎంపీ మాగుంట

పంచాయతీ వ్యవస్థలో

సంస్కరణలు శుభపరిణామం

సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జి.వీరభద్రాచారి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో పంచాయతీ వ్యవస్థలో సమూల సంస్కరణలకు శ్రీకారం చుట్టడం శుభపరిణామమని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి అభిప్రాయపడ్డారు. బుధవారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో అమలులో ఉన్న కార్యదర్శి క్లస్టర్ వ్యవస్థ రద్దు పరచి ఆ స్థానంలో జనాభా ప్రాతిపదికగా సచివాలయం సిబ్బందిని విభజించడంతోపాటు ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి ఉండాలన్న నిబంధనతో పాలన సజావుగా సాగుతుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి మరిన్ని సంస్కరణలు అవసరమని వీరభద్రాచారి తెలిపారు. సంస్కరణలు అధ్యయనం కోసం ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో ఆ కమిటీలో రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం తరపున ఎలాంటి సభ్యత్వం, చర్చల్లో ప్రాధాన్యతలు లేకపోవడం దురదష్టకరమన్నారు. అధ్యయన కమిటీలో పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్‌ను నియమించాలని పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు వీరభద్రచారి విజ్ఞప్తి చేశారు. అధికారులే కమిటీలో ఉండటంతో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఉండదన్న అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలని వీరభద్రాచారి ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు రామిరెడ్డి, నారాయణ, ప్రసాద్, నాగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల మిళితంపై

అధికారులు కసరత్తు చేయాలి

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ పాఠశాలల మిళితంపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కసరత్తు చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. విద్యాశాఖ అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందించాలని కలెక్టర్ చెప్పారు. బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి మంచి పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పాలని, అవగాహన కల్పిస్తూ వారిలో స్ఫూర్తి నింపాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అధికారులు కషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు విద్యాబోధనపై ఆసక్తి చూపడం లేదన్నారు. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపి తగ్గుముఖం పడుతుందనే సమాచారం అందిందన్నారు. ఏ అంశాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయులను చైతన్య పరచాలన్నారు. విద్యార్థులలో సామాజిక అంతరాలు తొలగించడం, ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పాఠశాల ఉండేలా మిళితం చేసే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థులలో డ్రాప్ అవుట్స్ పూర్తిగా అరికట్టడానికి ఈ నూతన విధానం ఎంతో ఉపయుక్తమన్నారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థుల డ్రాప్ అవుట్స్ ని గుర్తించి, కళాశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులను చైతన్య పరచాలన్నారు. విద్యార్థులలో సమానత్వంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల మిళితంపై ఇప్పటికే తయారుచేసిన నివేదికను పున పరిశీలన చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

డిజిటల్ లైబ్రరీ కోసం

ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేందుకు కార్పొరేట్ స్థాయి విద్య నైపుణ్యం పేద విద్యార్థులకు అందించేందుకు బాపట్ల మునిసిపల్ హై స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ మరియు డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు ఎంపీలాడ్స్ నుంచి రూ.50 లక్షల నిధులను బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ ఇవ్వనున్నారు. జిల్లాలో డిజిటల్ ల్యాబ్‌లను ప్రయోగాత్మకంగా మొదలు పెట్టేందుకు ఎంతో పూర్వ చరిత్ర ఉన్న బాపట్ల మున్సిపల్ స్కూల్ లో గత డిసెంబర్ 7 న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆధ్వర్యంలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ లో తెన్నేటి కృష్ణప్రసాద్ ఈ మేరకు ప్రకటించారు. ల్యాబ్ ఏర్పాటు ఆలోచన ఎంతో మంది పేద విద్యార్థులలో నైపుణ్యం పెంచేందుకు దోహదపడుతుందని నారా లోకేష్ అభినందించారు.

లోకేష్‌తో ఎంపీ కృష్ణప్రసాద్

ఆ ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎయిడెడ్ పాఠశాలల్లో సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులను విధులలోకి తీసుకోవాలని డిఇఒను యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి వీరాంజ నేయులు కోరారు. ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను సర్దుబాటులో వివిధ మండలాల్లోని ఎయిడెడ్ పాఠశాలలకు కేటాయించారన్నారు. జిల్లావ్యాప్తంగా 50 మంది ఉపాధ్యాయులు పైగా ఉన్నారని, విధుల్లో చేర కుంటే గ్యాప్ పీరియడ్ కు వేతన సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు.

మహిళలు కూడా హెల్మెట్ ధరించాలి

బైక్ ర్యాలీని ప్రారంభించిన మేయర్ సుజాత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మహిళలు కూడా ద్విచక్ర వాహనాలను నడుపుతున్నప్పుడు హెల్మెట్ తప్పక ధరించాలని ఒంగోలు మేయర్ గంగాడ సుజాత సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం ఉప రవాణా కమిషనర్ ఆర్. సుశీల ఆధ్వర్యంలో మహిళల బైక్ ర్యాలీని ఒంగోలు మేయర్ జెండా ఊపి ప్రారంభించారు. ఒంగోలు మేయర్, డిటిసి ఆర్.సుశీల స్వయంగా బైక్‌ను నడిపి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుండి కోర్టు సెంటర్, పద్మాలయ బేకరీ, సాయిబాబా గుడి, కళానికేతన్ సెంటర్, ముంగమూరు జంక్షన్, ఎన్‌పి కార్యాలయం, అద్దంకి బస్టాండ్, కొత్తపట్నం బస్టాండు మీదుగా తిరిగి కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకొని మహిళలు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఒంగోలు మేయర్ మాట్లాడుతూ మహిళలు ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. వారి కుటుంబ సభ్యులు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని సూచించాలన్నారు. రహదారి ప్రమాదాల నుంచి రక్షణ పొందేందుకు హెల్మెట్ ఎంతో దోహదం చేస్తుందని, ప్రజలందరూ హెల్మెట్‌ను ధరించాలని మేయర్ సూచించారు. కార్యక్రమంలో పోలీస్ శాఖలో పనిచేస్తున్న మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్ళు, మెప్మా మహిళా ఉద్యోగులు, కాలేజీ విద్యార్థినులు, ఎన్జీవో మహిళ నాయకులు, షోరూంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో మోటారు వాహన తనిఖీ అధికారులు ఏ. కిరణ్ ప్రభాకర్, కె రామచంద్రరావు, ఎల్ సురేంద్ర ప్రసాద్, జి భాస్కర రావు, సహాయ మోటారు వాహన తనిఖీ అధికారులు యు ధర్మేంద్ర, భాను ప్రకాష్, పరిపాలనాధికారి ఎం. శ్రీనివాసులు రావు, రవాణా శాఖ సిబ్బంది, హెూం గార్డులు పాల్గొన్నారు.

ర్యాలీలో మేయర్ సుజాత, డిటిసి సుశీల